# సాక్షి గుంటూరు

శనివారం । 5 । జూలై । 2025






### కనక దుర్గమ్మకు బోనాలు


పిడుగురాళ్ల: పిడుగురాళ్ల భవానీనగర్‌లో వేంచేసియున్న కనకదుర్గమ్మ అమ్మవారికి ఆషాఢ మాసం రెండో శుక్రవారం పురస్కరించుకుని బోనాల మహోత్సవం వైభవంగా నిర్వహించారు.



### అమ్మవారికి సారె సమర్పణ

నరసరావుపేట ఈస్ట్: ఆషాఢ మాసం సందర్భంగా పాతూరు భీమలింగేశ్వరస్వామి ఆలయంలోని పార్వతీ అమ్మవారికి శుక్రవారం మహిళలు సారె సమర్పించారు.

### శాకంబరీగా వాసవీమాత



అచ్చంపేట: ఆషాఢ మాసం రెండవ శుక్రవారం సందర్భంగా అచ్చంపేటలోని శ్రీవాసవీ కన్యకాపరమేశ్వరి అమ్మవారు శాకంబరీగా దర్శనమిచ్చారు. కూరగాయలు, ఆకు కూరలు, పండ్లతో అమ్మవారిని అలంకరించారు.

## న్యూస్‌రీల్

### నిర్ణయించిన వేతనాలే దినసరి కూలీలకు ఇవ్వాలి



గుంటూరు వెస్ట్: ప్రభుత్వ శాఖల్లో పనిచేసే దినసరి కూలీల (ఎన్‌ఎంఆర్ వర్కర్స్)కు నిర్ణయించిన మేరకు వేతనాలు ఇవ్వాలని జిల్లా రెవెన్యూ అధికారి షేక్ ఖాజావలి తెలిపారు. కలెక్టరేట్‌లోని డీఆర్వో చాంబర్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన జిల్లా స్థాయి వేతనాల కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. అత్యంత నైపుణ్యం కలిగిన వారికి రూ.910, నైపుణ్యం కలిగిన వారికి రూ.860, పాక్షిక నైపుణ్యం కలిగిన వారికి రూ. 800, నైపుణ్యం లేనివారికి రూ.680 వేతనాలుగా నిర్ణయించామని వెల్లడించారు. ఇవి ఈ ఏడాది ఏప్రిల్ 1 నుంచి వచ్చే ఏడాది మార్చి 31 వరకు వర్తిస్తాయని తెలిపారు. అధికారులు విధిగా దీనిని పాటించాలని డీఆర్వో ఆదేశించారు. సమావేశంలో డెప్యూటీ లేబర్ కమిషనర్ ఏ.గాయత్రీదేవి, కమిటీలోని జిల్లా అధికారులు పాల్గొన్నారు.

### ఇంటిలో చోరీ

లక్ష్మీపురం: గుర్తు తెలియని వ్యక్తులు ఇంటి తాళాలు పగలగొట్టి బీరువాలోని బంగారం, వెండి, రూ.1లక్ష చోరీ చేసిన ఘటనపై నగరంపాలెం పోలీసులు శుక్రవారం కేసు నమోదు చేశారు. వివరాలు.. భానుప్రసాద్ కాలనీ రెండవ లైన్‌కు చెందిన పడదల ప్రభాకర్ పాలీష్ పని చేసుకుంటూ జీవనం సాగిస్తుంటాడు. జూన్ 20న చెన్నైలో ఓ శుభకార్యానికి భార్యాభర్తలు ఇంటికి తాళాలు వేసి వెళ్లారు. అయితే, ఈనెల 3న ఎదురుగా ఉంటున్న ఓ మహిళ ఫోన్ చేసి, ఇంట తాళాలు పగలగొట్టి ఉన్నట్లు చెప్పింది. దీంతో హుటాహుటిన శుక్రవారం గుంటూరులోని ఇంటికి ప్రభాకర్ భార్యతో చేరుకున్నాడు. బీరువాలోని 40 గ్రాముల బంగారం, రూ.1లక్ష నగదు, వెండి వస్తువులు చోరీ అయినట్లు గుర్తించి, నగరంపాలెం పోలీసులకు సమాచారం ఇచ్చాడు. సీఐ నజీర్ బేగ్ సిబ్బందితో వెళ్లి ఘటన జరిగిన వైనాన్ని పరిశీలించారు.

## అన్నదాత పక్షాన నిరసన గళం

- జెడ్పీ సర్వసభ్య సమావేశంలో నినదించిన వైఎస్సార్ సీపీ ఎమ్మెల్సీలు, జెడ్పీటీసీ సభ్యులు
- గిట్టుబాటు ధరలు లేక నష్టపోతున్న రైతులు
- కల్తీ విత్తనాలతో నష్టపోయిన రైతులకు పరిహారం ఇవ్వాలి
- వ్యాపారులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్



సమావేశం వేదికపై ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు, ఎంపీ శ్రీకృష్ణదేవరాయలు, జెడ్పీ చైర్‌పర్సన్ హెనీ క్రిస్టినా, కలెక్టర్లు నాగలక్ష్మి, అరుణ్‌బాబు తదితరులు

గుంటూరు ఎడ్యుకేషన్ : అన్నదాతల ఆక్రందనలపై వైఎస్సార్ సీపీ ఎమ్మెల్సీలు, జెడ్పీటీసీ సభ్యులు జెడ్పీ సర్వసభ్య సమావేశం వేదికగా గళం విన్పించారు. పంటలకు గిట్టుబాటు ధరలు లేక, కల్తీ విత్తనాలతో నష్టపోయిన రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. నకిలీ విత్తనాలు అమ్మిన వ్యాపారులపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని కోరారు. జెడ్పీ సమావేశ మందిరంలో శుక్రవారం చైర్‌పర్సన్ కత్తెర హెనీ క్రిస్టినా అధ్యక్షతన సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించారు. తొలుత అల్లూరి సీతారామరాజు జయంతి సందర్భంగా చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఎమ్మెల్సీ చంద్రగిరి ఏసురత్నం మాట్లాడుతూ కల్తీ విత్తనాలు విక్రయించిన వ్యాపారుల నుంచి రైతులకు నష్ట పరిహారాన్ని అందించడంతో పాటు క్రిమినల్ కేసులు నమోదు చేయించాలని డిమాండ్ చేశారు. మిర్చి, పొగాకుకు గిట్టుబాటు ధరలు లేక రైతులు నష్టాలు చూస్తున్న సంఘటనలపై ఎమ్మెల్సీ మర్రి రాజశేఖర్ మాట్లాడారు. సమావేశంలో ఎమ్మెల్యేలు కన్నా లక్ష్మీనారాయణ, ధూళిపాళ్ల నరేంద్ర, నక్కా ఆనంద్‌బాబు, బాష్యం ప్రవీణ్, జీడీసీఎంఎస్ చైర్మన్ మక్కెన మల్లికార్జునరావు, డీసీఎంఎస్ చైర్మన్ వడ్రాణం హరి బాబు, బాపట్ల డీఆర్వో గంగాధర్ గౌడ్, జెడ్పీ సీఈవో వి. జ్యోతిబసు, సీపీవో శేషశ్రీ, పీడీ డీఆర్డీఏ విజయలక్ష్మి, జిల్లా వ్యవసాయ అధికారి నాగేశ్వరరావు, జిల్లా వ్యాధి నిరోధక టీకాల అధికారి డాక్టర్ శ్రావణ్‌బాబు, ఏడీ మైనింగ్ చంద్రశేఖర్, జెడ్పీటీసీ సభులు, ఎంపీపీలు, ఉమ్మడి గుంటూరు జిల్లా అధికారులు పాల్గొన్నారు.

**వరికపూడిశెల నిర్మాణానికి ప్రాధాన్యం**

నర్సరావుపేట ఎంపీ లావు శ్రీకృష్ణ దేవరాయలు మాట్లాడుతూ వరికపూడిశెల ప్రాజెక్టు నిర్మాణానికి ప్రభుత్వ అత్యంత ప్రాధాన్యం ఇస్తోందని తెలిపారు. కేంద్ర ప్రభుత్వ పథకాలతో అనుసంధానం చేసి నిధులు మంజూరు అయ్యేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు. పెదకూరపాడు మండలంలో గారపాడు చెరువు పూడ్చివేసి అక్రమించడంపై జిల్లా పంచాయతీ అధికారి విచారణ చేసి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

» జిల్లా కలెక్టర్ ఎస్. నాగలక్ష్మి మాట్లాడుతూ కౌలు రైతులందరికీ బ్యాంకులు ద్వారా రుణాలు మంజూరుకు చర్యలు తీసుకుంటున్నామని వెల్లడించారు. నల్లబర్లి పొగాకు కొనుగోలుకు చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు.

» పల్నాడు జిల్లా కలెక్టర్ అరుణ్ బాబు మాట్లాడుతూ జిల్లాలో గ్రామీణ ప్రాంతాల్లోని అనధికార లేఅవుట్లపై చర్యలు తీసుకోవాలని జిల్లా పంచాయతీ అధికారిని ఆదేశించినట్లు చెప్పారు.

» మాచర్ల ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మారెడ్డి మాట్లాడుతూ దీర్ఘకాలికంగా రైతులు ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకొని ఏపీఎస్ఐడీసీ స్కీంలో పంటలకు సాగునీరు అందించే ఎత్తిపోతల పథకాలు సక్రమంగా నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

» ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్‌ను 4వ స్థాయీ సంఘ సభ్యునిగా ఎంపిక చేస్తూ ఏకగ్రీవంగా తీర్మానించారు. స్థాయి సంఘాల్లో ఆమోదించిన పనులకు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చారు.

### జెడ్పీటీసీలు ఏమన్నారంటే...

➡ పెదకూరపాడు జెడ్పీటీసీ సభ్యురాలు కంకణాల స్వర్ణకుమారి మాట్లాడుతూ గారపాడులో రెండున్నర ఎకరాల చెరువును ఆక్రమించారని సభ దృష్టికి తెచ్చారు. దీనిపై స్థానిక తహసీల్దార్‌కు ఫిర్యాదు చేయగా, గ్రామంలోని పెత్తందారులు ఇంటిపైకి దాడి చేసేందుకు వచ్చారని వాపోయారు. నాలుగు ఎకరాల చెరువును పూడ్చి అక్రమ కట్టడాలు కడుతుంటే, వర్షాలు కురిసినప్పుడు నీరు ఏ విధంగా ప్రవహిస్తుందని ప్రశ్నించారు. దీనిపై అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకునే నాథుడే లేరని ఆవేదన వ్యక్తం చేశారు.

➡ అమరావతి-సత్తెనపల్లి మార్గంలో జెడ్పీకి చెందిన రూ.కోట్ల విలువైన రెండెకరాల స్థలం ఆక్రమణలకు గురైందని సభ దృష్టికి తెచ్చారు, ప్రస్తుతం అది డంపింగ్ యార్డుగా వాడుతున్నారని, దీనిపై చర్యలు తీసుకోవాలని సభ్యులు సమావేశం దృష్టికి తెచ్చారు.

➡ బొల్లాపల్లి జెడ్పీటీసీ సభ్యురాలు రమావతు భీమిబాయి మాట్లాడుతూ వరికపూడిశెల ప్రాజెక్టును పూర్తి చేసి బొల్లాపల్లి ప్రజల దాహార్తి తీర్చాలని కోరారు. ప్రభుత్వం చేపట్టిన బనకచర్ల ప్రాజెక్టుతో బొల్లాపల్లి మండలంలోని 20 గ్రామాల ప్రజలు నిరాశ్రయులుగా మారే పరిస్థితులు ఎదురయ్యాయని ఆందోళన వ్యక్తం చేశారు. వరికెపూడిశెల వచ్చిందని ఆనందపడేలోపు బనకచర్ల రూపంలో నిర్వేదం ఎదురైందని తెలిపారు.

➡ గురజాల మెడికల్ కళాశాల ప్రగతిపై పలువురు జెడ్పీటీసీ సభ్యులు సంధించిన ప్రశ్నలపై వైద్యారోగ్యశాఖాధికారులు సమాధానాలు చెప్పలేకపోయారు. దీనిపై ఎంపీ లావు కృష్ణదేవరాయలు జోక్యం చేసుకున్నారు. మెడికల్ కళాశాల నిర్మాణానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి వచ్చిన నిధులు, వాటితో చేపట్టిన పనుల ప్రగతిపై నివేదిక ఇవ్వాలని అధికారులను కోరారు.

➡ అన్నదాత సుఖీభవ పథకాన్ని ఎప్పుడు అమలు చేస్తున్నారంటూ రాజుపాలెం జెడ్పీటీసీ సభ్యురాలు సునీతారెడ్డి, కో-ఆప్షన్ సభ్యుడు హసీం ప్రశ్నించారు. దీనిపై ప్రభుత్వ విప్ జీవీ ఆంజనేయులు, ఎంపీ శ్రీకృష్ణ దేవరాయలు సమాధానమిస్తూ కేంద్రం పీఎం కిసాన్ నిధులు విడుదల చేయగానే వాటితో కలిపి మూడు విడతల్లో రైతుల ఖాతాల్లో రూ.20వేలు జమ చేస్తామని చెప్పారు.

➡ రొంపిచర్ల జెడ్పీటీసీ సభ్యుడు పిల్లి ఓబుల్‌రెడ్డి మాట్లాడుతూ సభ్యులకు తెలియకుండా అభివృద్ధి పనులకు అనుమతులు ఇవ్వడంపై అభ్యంతరం వ్యక్తం చేశారు. సభ్యుల ఆమోదం లేకుండా పనులకు అనుమతులు ఇచ్చేసి, తీరా అవి పూర్తయిన తరువాతా సభలో పెట్టి ఆమోదించమంటున్నారని.. ఇది న్యాయమేనా? అని ప్రశ్నించారు.

### అల్లూరికి నివాళి



విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న కలెక్టర్ నాగలక్ష్మి, ఎమ్మెల్యే నసీర్

గుంటూరు వెస్ట్: విప్లవ యోధుడు అల్లూరి సీతారామరాజు 128వ జయంతిని పురస్కరించుకుని శుక్రవారం స్థానిక నాజ్ సెంటర్ వద్ద గల ఆయన విగ్రహానికి కలెక్టర్ ఎస్.నాగలక్ష్మితో పాటు జీఎంసీ కమిషనర్ పులి శ్రీనివాసులు, తూర్పు నియోజకవర్గ శాసన సభ్యుడు మొహమ్మద్ నజీర్ అహ్మద్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అల్లూరి త్యాగాలను నేటి యువత నిత్యం మననం చేసుకోవాలని చెప్పారు. కార్యక్రమంలో డీఆర్వో షేక్ ఖాజావలి, స్టెప్ సీఈఓ చంద్రముని, జిల్లా గిరిజన సంక్షేమ శాఖాధికారి పి.మురళి, అధికారులు పాల్గొన్నారు.

### ఏపీ విపత్తుల నిర్వహణ సంస్థ కార్యాలయంలో...





తాడేపల్లి రూరల్: తాడేపల్లి పట్టణ పరిధిలోని ఏపీ విపత్తుల నిర్వహణ సంస్థ కార్యాలయంలో అల్లూరి సీతారామరాజు జయంతి వేడుకలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ ప్రఖర్ జైన్ అల్లూరి సీతారామరాజు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారతావనికి స్వేచ్ఛను అందించేందుకు ప్రజల్లో చైతన్యం నింపి, స్వాతంత్ర్య ఉద్యమానికి దివిటీగా మారిన సమరయోధుడు అల్లూరని కొనియాడారు. కార్యక్రమంలో ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ వెంకట దీపక్, ఏవో శ్రీధర్, సిబ్బంది పాల్గొన్నారు.

## రాష్ట్రంలో రెడ్ బుక్ పాలన

- మాజీ మంత్రి మేరుగ నాగార్జున ఆగ్రహం
- నాగమల్లేశ్వరరావుకు ఏమైనా జరిగితే చంద్రబాబే బాధ్యులు



మాట్లాడుతున్న మేరుగ నాగార్జున. పక్కన ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి తదితరులు

గుంటూరు మెడికల్: పొన్నూరు మండలం మన్నవ గ్రామ సర్పంచ్ బొనిగల నాగమల్లేశ్వరరావుకు ఏమైనా జరిగితే దానికి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడే కారణమని మాజీ మంత్రి మేరుగ నాగార్జున ఆగ్రహం వ్యక్తం చేశారు. టీడీపీ గూండాల దాడిలో తీవ్రంగా గాయపడి గుంటూరు రమేష్ హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్న సర్పంచ్ నాగమల్లేశ్వరరావును శుక్రవారం మేరుగ నాగార్జున, ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి, మాజీ ఎమ్మెల్యే గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి తదితరులు పరామర్శించారు. ఈ సందర్భంగా నాగార్జున మాట్లాడుతూ నాగమల్లేశ్వరరావు కుటుంబానికి ఎప్పటి నుంచో నియోజకవర్గంలో మంచి పేరు ఉందని తెలిపారు. గ్రామంలో అడ్డగోలుగా టీడీపీ నేతలు మట్టి తవ్వకాలు చేస్తున్నారని ఫిర్యాదు చేసినందుకే తీవ్రంగా దాడి చేశారని ఆరోపించారు. నాగమల్లేశ్వరరావు మెదడు బాగా దెబ్బతిందని, అవయవాలు పని చేయడం లేదని తెలిపారు. టీడీపీ కూటమి ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేస్తోందని మండిపడ్డారు. సీఎం చంద్రబాబు ఒక టీమ్ పెట్టుకుని వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు, సానుభూతిపరులు, నాయకులపై దాడి చేయిస్తున్నారని ధ్వజమెత్తారు. ఇటీవల మృతి చెందిన సింగయ్య కేసు విషయంలో కూడా గుంటూరు జిల్లా ఎస్పీ సింగయ్య మృతికి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి కాన్వాయ్ కారుకు సంబంధం లేదని చెప్పారన్నారు. మళ్లీ జగన్ కారుపై కేసు పెట్టడంపై కోర్టు కూడా తీవ్రంగా ప్రభుత్వానికి , పోలీసులకు అక్షింతలు వేసిందని తెలిపారు. సింగయ్య మృతి గురించి సీఎం చంద్రబాబు సభలో మాట్లాడుతూ కుక్కలతో పోల్చారని, ఇది ఎస్సీలను తీవ్రంగా అవమానించటమేనని పేర్కొన్నారు. అనంతపురంలో 13 ఏళ్ల బాలికపై 18 మంది రేప్ చేస్తే ఎందుకు స్పందించడం లేదని ప్రశ్నించారు. రాష్ట్రంలో సీఎం చంద్రబాబు, మంత్రి లోకేష్‌ల రెడ్ బుక్ రాజ్యాంగం నడుస్తోందని మండిపడ్డారు. ఎస్సీలంతా వైఎస్ జగన్ వెంట ఉంటారు కాబట్టి వారిని భయపెట్టేలా, అంతం చేసేలా దాడులు చేస్తున్నారని ఆరోపించారు. నాగమల్లేశ్వరరావు దాడి ఘటనలో నిందితులను తక్షణమే అరెస్ట్ చేయాలని, రిటైర్డ్ జడ్జితో విచారణ చేయించాలని నాగార్జున డిమాండ్ చేశారు. పోలీసుల సహకారం లేకుండా ఇలాంటి దాడులు జరగవని ఆయన ఆరోపించారు.

## బాబు మోసాలను ఎండగడదాం !

- కూటమి ఏడాది పాలనను ప్రజలకు వివరించండి
- బాబు ష్యూరిటీ - మోసం గ్యారెంటీపై కార్యకర్తలు సైనికుల్లా పోరాడాలి
- రీ కాలింగ్ చంద్రబాబు మేనిఫెస్టో ఇంటింటికీ ప్రచారం
- క్యూ ఆర్ కోడ్ పోస్టర్ ఆవిష్కరణ
- నియోజకవర్గ నాయకులతో విస్తృతస్థాయి సమావేశంలో నిర్ణయం



క్యూఆర్ కోడ్ పోస్టరును ఆవిష్కరిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు



సమావేశంలో పాల్గొన్న వివిధ విభాగాల అధ్యక్షులు, నాయకులు

మంగళగిరి టౌన్ /మంగళగిరి: ఎన్నికల ముందు చంద్రబాబు హామీలిచ్చి, అధికారంలోకి వచ్చిన తరువాత వాటిని అమలు చేయకుండా చేసిన మోసాలను ప్రజల్లోకి తీసుకువెళ్లాలని గుంటూరు జిల్లా వైఎస్సార్‌సీపీ అధ్యక్షులు అంబటి రాంబాబు పిలుపునిచ్చారు. మంగళగిరి నగర పరిధిలోని బైపాస్ రోడ్డులో గల వైఎస్సార్ సీపీ నియోజకవర్గ కార్యాలయంలో శుక్రవారం నియోజకవర్గ నాయకులతో విస్తృతస్థాయి సమావేశం నిర్వహించారు. రీకాలింగ్ చంద్రబాబు మేనిఫెస్టో క్యూఆర్ కోడ్ పోస్టర్లను ఆవిష్కరించారు. పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా బాబు మోసపూరిత హామీలను నాయకులకు, కార్యకర్తలకు వివరించారు. ఈ సందర్భంగా అంబటి రాంబాబు మాట్లాడుతూ కూటమి ఏడాది పాలనలో హామీల అమలులో జరుగుతున్న మోసాన్ని వైఎస్సార్ సీపీ శ్రేణులంతా ప్రజలకు వివరించాలని చెప్పారు. మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్ సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి శ్రీకారం చుట్టిన బాబు ష్యూరిటీ - మోసం గ్యారెంటీ కార్యక్రమాన్ని ఇంటింటికీ వెళ్లి ప్రచారం చేయాలని చెప్పారు. కార్యక్రమంలో నియోజకవర్గ పరిధిలోని మంగళగిరి, తాడేపల్లి, దుగ్గిరాల మండలాల వివిధ విభాగాల అధ్యక్షులు, నియోజకవర్గ సమన్వయ కర్తలు, మాజీ కౌన్సిలర్లు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

### కార్యాచరణ సిద్ధం

ఆర్హత ఉండి ప్రభుత్వ సంక్షేమ పథకాలు పొందని వారి తరపున పోరాటం చేసేందుకు కార్యాచరణ సిద్ధం చేశాం. ఇందులో భాగంగా ప్రతి గ్రామం నుంచి నాయకులు, కార్యకర్తలతో కలసి పోరాటం చేస్తాం. నిస్వార్థంగా వైఎస్సార్ సీపీ తరఫున కష్టపడుతున్న కార్యకర్తలకు ఎప్పుడూ గుర్తింపు ఉంటుంది. వారికి ఏ అవసరం వచ్చినా పార్టీ ముందుంటుంది.

– మురుగుడు హనుమంతరావు, ఎమ్మెల్సీ

### ఏడాది పాలనకే విసుగెత్తిన ప్రజలు

ఏడాది కూటమి ప్రభుత్వ పాలనపై ప్రజలు విసుగెత్తిపోయారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు సూపర్‌సిక్స్ పథకాలు మొత్తం అమలు చేశామని చెప్పుకోవడం సిగ్గుచేటు. హామీలను అమలు చేయకపోగా తొలి అడుగు అంటూ ఊర్లకు వస్తున్న నాయకులను రాష్ట్రవ్యాప్తంగా ప్రజలు నిలదీస్తున్నారు. ఇచ్చిన మాట నిలబెట్టుకోవడం అంటే జగనన్నను చూసి కూటమి ప్రభుత్వం నేర్చుకోవాలి.

– మోదుగుల వేణుగోపాలరెడ్డి, మాజీ ఎంపీ

### ప్రజల పక్షాన పోరాటం

కూటమి నాయకుల మాటలు నమ్మి మోసపోయిన ప్రజలకు పార్టీ శ్రేణులు అండగా నిలవాలి. వారి తరఫున పోరాటం చేయడానికి సిద్ధం కావాలి. చంద్రబాబు ఎప్పుడు అధికారంలోకి వచ్చినా రైతులు, మహిళలను మోసం చేయడం ఆనవాయితీ. వైఎస్సార్ సీపీ నాయకులపై కేసులు పెట్టడమే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం పని చేస్తోంది.

– చిల్లపల్లి మోహనరావు, ఆప్కో మాజీ చైర్మన్

### మోసాలను ప్రజల్లోకి తీసుకువెళదాం

కూటమి చేసిన మోసాలను ప్రజల్లోకి తీసుకువెళ్లి ప్రతి ఒక్కరికీ వివరించాలి. తాటాకు చప్పుళ్లు, బెదిరింపులకు వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు బెదిరిపోరు. బాబు ష్యూరిటీ - మోసం గ్యారెంటీ పేరిట కార్యక్రమాన్ని ప్రజల్లోకి తీసుకు వెళ్లేందుకు రీ కాలింగ్ చంద్రబాబు మేనిఫెస్టో పేరిట ఇంటింటికీ ప్రచార కార్యాచరణపై సమావేశాలు ఏర్పాటు చేసి కార్యకర్తలకు దిశా నిర్దేశం చేస్తాం.

–దొంతిరెడ్డి వేమారెడ్డి, మంగళగిరి నియోజకర్గ సమన్వయకర్త

## కార్యకర్తలకు అండగా వైఎస్సార్ సీపీ

- పొన్నూరు ప్రజలను భయభ్రాంతులకు గురి చేస్తున్న టీడీపీ
- స్థానికంగా ప్రతిపక్షం లేకుండా చేయాలన్నదే లక్ష్యం
- కుల, హత్యారాజకీయాలను ప్రోత్సహిస్తున్న ఎమ్మెల్యే నరేంద్ర
- మన్నవలో ఒకే సామాజిక వర్గాన్ని అణచి వేయడమే లక్ష్యంగా కుట్ర



గుంటూరులోని ఆస్పత్రి వద్దకు వచ్చిన వైఎస్సార్ సీపీ శ్రేణులకు ధైర్యం చెబుతున్న అంబటి మురళీకృష్ణ

పొన్నూరు: టీడీపీ మూకల దాడిలో తీవ్రంగా గాయపడి ప్రాణాపాయస్థితిలో చికిత్స పొందుతున్న మన్నవ సర్పంచ్ బొనిగల నాగమల్లేశ్వరరావుకు అంబటి మురళీకృష్ణ అండగా నిలిచారు. హాస్పిటల్‌కు వచ్చినప్పటి నుంచి ఆయన దగ్గర ఉండి మెరుగైన వైద్యం అందించే విధంగా పర్యవేక్షిస్తున్నారు. స్పెషలిస్టులతో మాట్లాడి ఎప్పటికప్పుడు నాగమల్లేశ్వరరావు ఆరోగ్య పరిస్థితిని తెలుసుకుంటూ, కుటుంబ సభ్యులకు ధైర్యం చెబుతున్నారు. నాగమల్లేశ్వరరావు త్వరగా కోలుకోవాలని అంబటి మురళీకృష్ణతో పాటు, నియోజకవర్గ నాయకులు, కార్యకర్తలు ప్రార్థనలు చేస్తున్నారు. నాగమల్లేశ్వరరావుపై దాడిని అంబటి మురళీకృష్ణ తీవ్రంగా ఖండించారు. పొన్నూరు ప్రజలను భయభ్రాంతులకు గురిచేసే విధంగా టీడీపీ పాలన సాగిస్తోందని మండిపడ్డారు. ప్రజలకు, వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలకు ఎల్లప్పుడూ వైఎస్సార్ సీపీ అండగా ఉంటుందని ఆయన స్పష్టం చేశారు. టీడీపీ నాయకులు రాజకీయంగా ఎదుర్కోలేక భౌతిక దాడులకు పాల్పడటం అత్యంత హేయమైన చర్యగా ఖండించారు. పచ్చగా ఉండే పల్లెల్లో ఎర్రటి రక్తాన్ని చిందిస్తున్నారని మండిపడ్డారు. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో ప్రజలు ఎన్నడూ చూడని హత్యా రాజకీయాలను నేడు టీడీపీ చేస్తోందని విమర్శించారు. ఎస్సీ సామాజిక వర్గాన్ని అణచివేయడమే లక్ష్యంగా మన్నవ గ్రామంలో కుల రాజకీయాలు చేయడాన్ని తప్పుబట్టారు. టీడీపీ అరాచకాలను ప్రజలు గమనిస్తున్నారని తెలిపారు. స్థానిక ఎమ్మెల్యే నరేంద్రకుమార్ రెడ్ బుక్ రాజ్యాంగాన్ని అమలు చేస్తున్నారనే విషయం ప్రజలకు స్పష్టంగా అర్థమవుతోందని వెల్లడించారు. భవిష్యత్తులో ప్రజాగ్రహానికి గురికాక తప్పదని ఆయన హెచ్చరించారు.

## సీలింగ్ భూముల క్రమబద్ధీకరణ గడువు పెంపు

**జాయింట్ కలెక్టర్ ఏ.భార్గవ్ తేజ**

గుంటూరు వెస్ట్: సీలింగ్ భూములను క్రమబద్ధీకరించాలనుకునే వారికి ఈ ఏడాది చివరి వరకు గడువు పొడిగించామని జాయింట్ కలెక్టర్ ఏ.భార్గవ్ తేజ తెలిపారు. స్థానిక కలెక్టరేట్‌లోని జేసీ చాంబర్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన అధికారుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సీలింగ్ భూములను గతంలో క్రమబద్ధీకరించుకోలేని వారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. ఇప్పటి వరకు అందిన అర్జీలను త్వరగా పరిష్కరించాలని ఆయన ఆదేశించారు.

## నేడు నృసింహుని హుండీ లెక్కింపు

మంగళగిరి టౌన్: పట్టణంలోని శ్రీ లక్ష్మీనరసింహస్వామి దేవస్థానం హుండీ లెక్కింపు శనివారం నిర్వహించనున్నట్లు కార్యనిర్వహణాధికారి సునీల్‌కుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. శ్రీ లక్ష్మీనరసింహస్వామి ఎగువ, దిగువ సన్నిధిలోను, శ్రీ పద్మావతి సమేత వెంకటేశ్వరస్వామి ఆలయంలో భక్తులు సమర్పించిన కానుకలు, మొక్కుబడుల హుండీలను ఉదయం 9 గంటలకు లెక్కించనున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఆసక్తి గల భక్తులు కార్యక్రమంలో పాల్గొనవచ్చని కార్యనిర్వహణాధికారి సునీల్‌కుమార్ తెలియజేశారు.



## పసుపు ధరలు
(శుక్రవారం)

యార్డుకు వచ్చిన బస్తాలు : 438

**కొమ్ములు : 198 బస్తాలు**

(ధర రూ॥ల్లో)

| కనిష్ట : | గరిష్ట : | మోడల్ : |
|---|---|---|
| 9,000 | 10,250 | 10,200 |

**కాయలు : 240 బస్తాలు**

| కనిష్ట : | గరిష్ట : | మోడల్ : |
|---|---|---|
| 9,000 | 10,250 | 10,200 |

మొత్తం అమ్మకాలు : 328.500 క్వింటాళ్లు

–దుగ్గిరాల

## వైద్య విద్యార్థులతో కూటమి సర్కార్ చెలగాటం



పట్నంబజారు: వైద్య విద్యార్థుల జీవితాలతో కూటమి సర్కార్ చెలగాటమాడుతోందని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ విద్యార్థి విభాగం జిల్లా అధ్యక్షుడు సీహెచ్. వినోద్ ధ్వజమెత్తారు. బృందావన్ గార్డెన్స్‌లోని పార్టీ జిల్లా కార్యాలయంలో శుక్రవారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. వైఎస్సార్ సీపీ అధ్యక్షులు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేద విద్యార్థులను డాక్టర్లుగా తీర్చిదిద్దేందుకు రాష్ట్ర వ్యాప్తంగా 17 మెడికల్ కళాశాలలను నిర్మించారని తెలిపారు. ఎక్కడా రాజీ పడకుండా రూ.8,500 కోట్లతో వైద్య విద్యార్థుల భవిష్యత్తే ధ్యేయంగా ఆయన ముందుకు సాగారని చెప్పారు. ఏడాది పాలనలో కనీసం విద్యార్థుల కోసం ఒక్క మంచి కార్యక్రమం చేపట్టని చంద్రబాబు ప్రభుత్వం, వారి జీవితాలను నాశనం చేస్తోందని మండిపడ్డారు. వైఎస్సార్ సీపీ హయాంలో ఎంతో వైభవోపేతంగా నడిచిన ప్రభుత్వ మెడికల్ కళాశాలలను ప్రైవేట్ పరం చేసే పన్నాగం పన్నుతోందని ఆరోపించారు. కూటమి సర్కార్ దుర్బుద్ధితో తీసుకున్న నిర్ణయం వల్ల వేల మంది మెరిట్ విద్యార్థులకు ఎంబీబీఎస్ విద్య దూరమవుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. వైఎస్సార్ సీపీ విద్యార్థి విభాగం రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు ఈ నెల 7న విజయవాడలోని ఎన్టీఆర్ హెల్త్ యూనివర్సిటీ వైస్ చాన్సలర్‌కు వినతిపత్రం అందజేయనున్నట్లు తెలిపారు. సమావేశంలో విద్యార్థి సంఘ నేతలు రవి, గంటి, జగదీష్, అజయ్, కోటి, అజయ్, అరుణ్, సన్నీ పాల్గొన్నారు.

# సీఎం చంద్రబాబు దళిత ద్రోహి

- ఎస్సీలంటే చులకన భావన
- అదే బాటలో మంత్రులు, ఎమ్మెల్యేలు
- సింగయ్య మృతిని కుక్కలతో పోల్చడం దారుణం
- ముఖ్యమంత్రిపై వెంటనే కేసు నమోదు చేయాలి
- రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యమానికి పిలుపునిస్తాం
- వైఎస్సార్ సీపీ ఎస్సీ, ఎస్టీ, బీసీ సెల్ నాయకులు



తాడేపల్లి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేస్తున్న రాష్ట్ర ఎస్సీ విభాగ అధ్యక్షులు, మాజీ ఎమ్మెల్యే టి.జె.ఆర్. సుధాకర్ బాబు, వైఎస్సార్ సీపీ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్, మాదిగ కార్పొరేషన్ మాజీ చైర్మన్ కొమ్మూరు కనకారావు తదితరులు

తాడేపల్లి రూరల్ : ముఖ్యమంత్రి చంద్రబాబుకు మొదటి నుంచి దళితులంటే చులకన భావన ఉంది.. బహిరంగ ప్రాంతాల్లోనే ఎస్సీలను దూషిస్తూ అవమాన పరుస్తున్నారు.. తాజాగా చిత్తూరు జిల్లా కుప్పంలో ఓ సమావేశంలో సింగయ్య మృతిని కుక్కతో పోల్చారని దళిత సంఘ నాయకులు, బీసీ నాయకులు శుక్రవారం తాడేపల్లి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వైఎస్సార్ సీపీ రాష్ట్ర ఎస్సీ విభాగ అధ్యక్షులు, మాజీ ఎమ్మెల్యే టి.జె.ఆర్. సుధాకర్‌బాబు, వైఎస్సార్ సీపీ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్, మాదిగ కార్పొరేషన్ మాజీ చైర్మన్ కొమ్మూరు కనకారావు మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు గతంలో ఎన్నోసార్లు దళితులను అవమానించారని తెలిపారు. బహిరంగ సభల్లో, విలేకరుల సమావేశంలో దళితులుగా ఎవరైనా పుట్టాలనుకుంటారా ? అని వ్యాఖ్యానించారని గుర్తుచేశారు. ఇప్పుడు కార్యకర్త సింగయ్య మృతి చెంది వారి కుటుంబం బాధల్లో ఉంటే మృతిని కుక్కతో పోల్చి అవమానించారని ధ్వజమెత్తారు. ఆయన వ్యాఖ్యలు చేయడమే కాకుండా వారి సోషల్ మీడియాలో విపరీతంగా ప్రచారం చేశారని పేర్కొన్నారు. రాష్ట్రంలోని దళితులు, బీసీలు జరిగిన సంఘటనపై చాలా బాధపడుతున్నారని, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుపై పోలీస్‌శాఖ వెంటనే నిజాయితీగా కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు.

రాష్ట్ర వ్యాప్తంగా ప్రతి జిల్లా కేంద్రంలోనూ ముఖ్యమంత్రి చంద్రబాబు వ్యాఖ్యలపై కేసులు పెడుతున్నామని చెప్పారు. ఆయన్ను అరెస్ట్ చేసేంతవరకు రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమాలు చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో గుంటూరు జిల్లా ఎస్సీ విభాగ అధ్యక్షులు గద్దేటి సురేంద్ర, గ్రీవెన్స్ సెల్ అధ్యక్షులు అంకంరెడ్డి నారాయణమూర్తి, ఎస్టీ నాయకులు లక్ష్మీపతి, రాష్ట్ర ఎస్సీ సెల్ ఉపాధ్యక్షులు బూదాల శ్రీను, శ్రీరాంశెట్టి పూర్ణచంద్రరావు, రాష్ట్ర ఎస్సీ సెల్ ప్రధాన కార్యదర్శి ముదిగొండ ప్రకాష్, నలకుర్తి రమేష్, రాష్ట్ర బొందిలి సంఘం అధ్యక్షులు బొందిలి నరేంద్ర సింగ్, రాష్ట్ర క్రిస్టియన్ మైనార్టీ కార్యదర్శి కలపాల అజయ్, మల్లవరపు సుధారాణి, సుభాషిణి, కొమ్ము చంటి, తాడేపల్లి రూరల్ అధ్యక్షులు అమరా నాగయ్య, కాపు సంఘం నాయకులు మిరియాల రాంబాబు, చిట్టిమల్ల సుబ్బు, దర్శి రమేష్, ప్రేమ్ కుమార్ పాల్గొన్నారు.

## వాణిజ్యం
### నిమ్మకాయల ధరలు

గుంటూరు జిల్లా తెనాలి మార్కెట్‌యార్డులో శుక్రవారం నిమ్మకాయల క్వింటా ధర

కనిష్టం : రూ. 1,200 గరిష్టం : రూ. 2,000

మోడల్ ధర రూ. 1,700

### మిర్చి యార్డు సమాచారం
(శుక్రవారం ధరలు)



| | |
|---|---|
| వచ్చిన బస్తాలు | 27,878 |
| అమ్మకాలు | 31,653 |
| నిల్వ | 3,750 |

**నాన్ ఏసీ కామన్ రకం క్వింటా (రూ.)**

| | |
|---|---|
| 334 | రూ. 9,500 – 13,000 |
| నంబరు–5 | రూ. 10,000 – 13,200 |
| 273 | రూ.10,000 – 13,500 |
| 341 | రూ. 10,000 – 12,200 |
| సూపర్ –10 | రూ. 9,800 – 12,500 |

**నాన్ ఏసీ ప్రత్యేక రకం క్వింటా (రూ.)**

| | |
|---|---|
| తేజ | రూ. 10,000 – 13,800 |
| బాడిగ – 355 | రూ. 10,000 – 12,600 |
| దేవనూరు డీలక్స్ | రూ. 10,000 – 12,400 |
| ఆర్మూర్ | రూ. 9,600 – 11,200 |
| తాలుకాయలు | రూ. 5,000 – 6,800 |

**ఏసీ కామన్ రకం క్వింటా (రూ.)**

| | |
|---|---|
| 334 | రూ. 9,500 – 13,000 |
| నంబరు–5 | రూ. 10,000 – 13,300 |
| 341 | రూ. 10,000 – 13,400 |
| 4884 | రూ. 10,000 – 12,200 |

**ఏసీ ప్రత్యేక రకాలు క్వింటా (రూ.)**

| | |
|---|---|
| తేజ | రూ. 10,000 – 13,500 |
| బాడిగ – 355 | రూ. 10,000 – 12,600 |
| దేవనూరు డీలక్స్ | రూ. 10,000 – 12,500 |
| తాలుకాయలు | రూ. 5,500 – 7,000 |

–కొరిటెపాడు (గుంటూరు)

## మనవరాలిని చంపిన తాత అరెస్ట్

వివరాలు వెల్లడించిన డీఎస్పీ మురళీకృష్ణ



విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ

తాడేపల్లి రూరల్ : మండలంలోని కుంచనపల్లి వద్ద 16వ నంబరు జాతీయ రహదారిపై ఉన్న బకింగ్ హామ్ కెనాల్ బ్రిడ్జి పైనుంచి మనవరాలిని నీళ్లలోకి విసిరేసి, మృతికి కారణమైన తాతయ్యను పోలీసులు శుక్రవారం అరెస్ట్ చేసి కోర్టుకు హాజరుపరిచారు. ఈ సందర్భంగా నార్త్ జోన్ డీఎస్పీ మురళీకృష్ణ మాట్లాడుతూ ఈనెల 1వ తేదీ రాత్రి 8.30 గంటల సమయంలో ఓ వృద్ధుడు బాలికను తీసుకువచ్చి బలవంతంగా కాలువలోకి విసిరి వేశాడని తెలిపారు. 100కు సమాచారం రావడంతో జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్ ఆదేశాల మేరకు ఎన్‌డీఆర్ఎఫ్ బృందంతో కాలువలో గాలించి, బాలిక మృతదేహాన్ని గుర్తించినట్లు చెప్పారు. బాలికను తాడికొండ మండలం బడేపురానికి చెందిన కూరపాటి హేమగా గుర్తించామని చెప్పారు. ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేసి బాలిక తాతయ్యను తాడికొండ అడ్డరోడ్డు వద్ద అదుపులోకి తీసుకున్నామని వివరించారు. పుట్టుకతోనే మానసిక వికలాంగురాలైన హేమ తల్లి, తండ్రి చనిపోయారన్నారు. తాతయ్య మాధవరావు, నాయనమ్మ సుమతి పెంచుతున్నట్లు చెప్పారు. నాయనమ్మ కూడా అనారోగ్యం పాలు కావడంతో ఈ మధ్య గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్పించారన్నారు. హేమకు కూడా అక్కడే వైద్యం చేయిస్తున్నారు. వైద్యులు అనారోగ్యం కుదుటపడదని చెప్పడంతో తాతయ్య, నాయనమ్మ ఆందోళన చెందారు. ఇద్దరికీ మందులు ఖర్చులకు డబ్బులు లేకపోవడం, తాము లేకపోతే మనవరాలు ఏమవుతుందనే ఆందోళనతో కాలువలోకి పడవేసి హత్య చేశాడని వివరించారు. ఈ సంఘటనపై కేసు నమోదు చేసి మాధవరావును అదుపులోకి తీసుకుని కోర్టుకు హాజరుపరిచామని డీఎస్పీ తెలిపారు. కేసును 24 గంటల్లో ఛేదించిన సిబ్బందికి ఎస్పీ సతీష్‌కుమార్ ప్రత్యేక అభినందనలు తెలియజేశారు.

## ట్రాన్స్‌పోర్ట్ సంస్థపై కేసు నమోదు

లక్ష్మీపురం: ఓ ప్రైవేటు కంపెనీకి చెందిన సరుకును డెలివరీ చేయకుండానే ట్రాన్స్‌పోర్ట్ కంపెనీ బిల్లు అడగటంపై అరండల్‌పేట పోలీసులు శుక్రవారం కేసు నమోదు చేశారు. వివరాలు.. గుంటూరు అరండల్‌పేటలోని గ్రీన్ హౌల్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ మేనేజర్ కాకుమాను పునీత్‌కుమార్ అదే ప్రాంతానికి చెందిన ఓ ట్రాన్స్‌పోర్ట్ సంస్థకు చెందిన వాహనంలో రూ.14 లక్షల విలువ చేసే సరుకును చెన్నై నుంచి బెంగళూరుకు లోడ్ చేశారు. అయితే, సరకు అక్కడ డెలివరీ చేయకుండానే చేసినట్లు చెప్పి బిల్లు చెల్లించాలని ట్రాన్స్‌పోర్ట్ కంపెనీ కోరింది. దీనిపై పునీత్‌కుమార్ అరండల్‌పేట పోలీసులను ఆశ్రయించి ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## జీడీసీసీ బ్యాంకు మాజీ చైర్మన్ నల్లపాటి చంద్రశేఖరరావు మృతి



నరసరావుపేట: గుంటూరు జిల్లా కేంద్ర సహకార బ్యాంకు (జీడీసీసీ) మాజీ చైర్మన్ నల్లపాటి శివరామ చంద్రశేఖరరావు (84) మృతిచెందారు. గత 20రోజులుగా ఆయన హైదరాబాదులోని ఓ ప్రైవేటు వైద్యశాలలో చికిత్స పొందుతూ శుక్రవారం మృతిచెందారు. మృతదేహాన్ని ఆయన స్వగ్రామం జొన్నలగడ్డకు తీసుకొచ్చారు. ఆయన భార్య రెండేళ్ల క్రితం చనిపోయారు. వీరికి ఇద్దరు కుమారులు ఉన్నారు. వీరిలో నల్లపాటి రామచంద్రప్రసాదు టీడీపీ కార్యనిర్వాహక కార్యదర్శిగా వ్యవహరిస్తున్నారు. గురజాల మాజీ శాసనసభ్యులు కాసు మహేష్‌రెడ్డి, ప్రస్తుత జీడీసీసీ బ్యాంకు అధ్యక్షులు, మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లికార్జునరావుతో పాటు పలువురు రాజకీయ నాయకులు, పట్టణ ప్రముఖులు చంద్రశేఖరరావు మృత దేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. శనివారం అంత్యక్రియలు నిర్వహించనున్నట్లు కుటుంబ సభ్యులు పేర్కొన్నారు. చంద్రశేఖరరావు మృతికి మాజీ మంత్రి కాసు వెంకటకృష్ణారెడ్డి ఓ ప్రకటనలో ప్రగాఢ సంతాపం వ్యక్తం చేశారు.